క్లుప్తంగా

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



అల్లీపూర్‌లో బ్యాటింగ్ చేస్తున్న భోగ శ్రావణి

రాయికల్: క్రీడలతో యువకుల్లో స్నేహసంబంధాలు పెంపొందుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లో వివేకానంద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో యువకుల్లో స్నేహ సంబంధాలతో పాటు శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై అజయ్, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, కో ఆప్షన్ మెంబర్ ముఖీద్, సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, తాజా మాజీ సర్పంచ్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



స్వామివారి సేవలో మాజీ ఎమ్మెల్యే దంపతులు

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో శ్రీ సీతారాముల ఆలయ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ సీతా రామచంద్రుల కల్యాణోత్సవం వైభంగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు-సరోజనా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌తో జిల్లా నాయకులు



కేసీఆర్‌తో జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు.

కథలాపూర్: మండలానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, పెద్దపెల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లోక బాపురెడ్డి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం కలిశారు. ఈ ప్రాంతంలో పార్టీ పరిస్థితిని కేసీఆర్‌కు వివరించారు.

ఐదు ఉద్యోగాలు సాధించిన యువతికి సన్మానం



మమతను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెగడపల్లి: మండలంలోని ల్యాగలమర్రిలో ఐదు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచిన యువతిని ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన పుప్పాల భూమయ్య-రమ దంపతుల కూతురు మమత ఇటీవల వెలువడిన పలు ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో ఏక కాలంలో ఐదు ఉద్యోగాలు సాధించింది. దీంతో గ్రామస్తులు మమతను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మమత సాధించిన ఉద్యోగాల ఫలితంగా జిల్లాలోనే ల్యాగలమర్రి గ్రామానికి మంచిపేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత మమతను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని కోరారు.

5న మండల సర్వసభ్య సమావేశం

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి ఆదివారం తెలిపారు. ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పల్స్ పోలియో విజయవంతం

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/సారంగాపూర్/రాయికల్/మల్లాపూర్/మల్యాల/మెట్‌పల్లిరూరల్/పెగడపల్లి/ధర్మపురి/ఇబ్రహీంపట్నం: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో చిన్నారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు పోలియో చుక్కలను వేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీలు, పీహెచ్‌సీలు, ఆస్పత్రులు,పాఠశాలల్లో 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో రాష్ట్ర పరిశీలకుడు కటకం శంకర్, తక్కళ్లపల్లి పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్, ధర్మపురిలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు.కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కోరుట్లలో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



కమలాపూర్‌లో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో



నర్సింగాపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ మహేశ్



చిన్నారికి చుక్కలు వేస్తున్న మెట్‌పల్లి ఎంపీపీ సాయిరెడ్డి



ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో రాష్ట్ర పరిశీలకులు శంకర్



రాయికల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు

శివరాత్రి ఉత్సవాలకు పెగడపల్లి రాజన్న ముస్తాబు

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్వయం భూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పెగడపల్లి రాజన్న ఆలయం ముస్తాబైంది. ఉత్సవాలు నిర్వహిం చేందుకు ఆలయానికి రంగులు వేసి, విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

దాతల విరాళాలతో ఆలయ నిర్మాణం

కమిటీ సభ్యులు, గ్రామస్తులు సమష్టిగా సుమారు రూ. 60 లక్షల విరాళాలు సేకరించి నిర్మాణం పూర్తి చేశారు. ఆలయంలో సత్యనారాయణస్వామి, దుర్గ మాతదేవి, ఆంజనేయస్వామి, నవ గ్రహాలు, సూర్యుడు, నాగేంద్రుడు, బలిపీఠం, విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఇటీవల దేవాదాయశాఖ నుంచి రూ. 50లక్షలు మంజూరు కాగా, గాలిగోపురం నిర్మాణం జరుగుతుంది. ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి దైవ దర్శనం చేసుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబైన రాజన్న ఆలయం

ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం ఆవరణలో చలువ పందిళ్లు వేయించారు. నీటి వసతితో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గంగారెడి, పోచయ్య, ఉత్సవ కమిటి సభ్యులు, అర్చకులు కోరారు.

కోరుట్లలో బీజేపీ శ్రేణుల సంబరాలు

కోరుట్ల: నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అరవింద్‌ను ప్రకటించడంతో కోరుట్ల పట్టణంలో బీజేపి నాయకులు ఆదివారం సంభరాలు జరుపుకున్నారు. పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద టపాకాయలు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్టపల్లి సాగర్, జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో సంబరాలు

కథలాపూర్: కరీంనగర్ ఎంపీ బీజేపీ టికెట్ బండి సంజయ్‌కుమార్‌కు కేటాయించడంతో కథలాపూర్ లో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు జరిపారు. బస్టాండ్ వద్ద టపాసులు కాల్చారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, కాసోజి ప్రతాప్, మల్యాల మారుతి, జిల్లా సత్యం, అజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో టపాకాయలు పేల్చుతున్న బీజేపీ శ్రేణులు

మోదీ,అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

మెట్‌పల్లిరూరల్: పసుపు పంటకు ఆశాజనకమైన ధర వస్తుండడంతో మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ లో బీజేపీ నాయకులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రధాని మోదీ, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రం పసుపు దిగుమతులను నియంత్రించడంతో పసుపుకు డిమాండ్ పెరిగిందన్నారు.ఎన్నడులేని విధంగా నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటాల్ పసుపు పంటకు రూ.14 వేలకు పైగా గరిష్ఠ ధర పలికిందన్నారు. పదేళ్లుగా అత్యల్ప ధరలతో కుదేలైన రైతులకు ఈ ధరలు జీవం పోస్తున్నయన్నారు. ఎంపీ అర్వింద్ కృషి వల్లే పసుపు పంటకు అధిక ధరలు వస్తున్నయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల యువమోర్చా ఉపాధ్యక్షుడు సాగర్,తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా మల్లన్న బోనాలు

ఆధ్యాత్మికం



కోరుట్లలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు, మహిళలు

కోరుట్ల: పట్టణంలోని శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం మల్లన్న బోనాల జాతర ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున మహిళలు మల్లన్నకు బోనాల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు తిరుమల గంగాధర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో ఆదివారం సాయంత్రం మల్లికార్జునస్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ లో మల్లన్న జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లిన భక్తులు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మంగళవారం నాగవెల్లి నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



కథలాపూర్ మండలం చింతకుంటలో..



మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో..

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్ పర్సన్‌ను కలిసిన కార్యవర్గ సభ్యులు

జగిత్యాలజోన్: జగిత్యాల మున్సిపల్ నూతన చైర్ పర్సన్‌గా ఎన్నికైన అడువాల జ్యోతిని ఆదివారం గణేశ్‌నగర్ కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి మధుసూధన్ రెడ్డి, కార్యదర్శి కొంరయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సేవా కేంద్రం



బుగ్గారంలో ఏర్పాటు చేసిన సేవాకేంద్రం

బుగ్గారం: ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడానికి నేటి నుంచి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీవో అఫ్జల్‌మియా తెలిపారు. ఈ కేంద్రంలో ప్రజాపాలనలో సమర్పించిన దరఖాస్తుల్లో కరెంట్ మీటరు, గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించి ప్రజలు ఇచ్చిన సమాచారంలో ఏవైనా పొరపాట్లు ఉంటే సవరించుకోవచ్చున్నారు. ప్రజలు గమనించి సేవాకేంద్రంలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక అధికారులను సంప్రదించాలని సూచించారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

గొల్లపల్లి: ఇంటర్ పరీక్షల విధులను నిర్వహించే అధ్యాపకులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(475)అసోసియేట్ ప్రెసిడెంట్ లింగంపల్లి దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రెమిడి మల్లారెడ్డి, పేర్కొన్నారు. ఆదివారం గొల్లపల్లిలో మాట్లాడారు. పరీక్ష విధుల్లో ఉండే అధ్యాపకులు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా బోర్డు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతి రెడ్డి, కోశాధికారి చలిమెల జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రక్తదానం

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణానికి చెందిన ఎండీ సులేమాన్‌కు అత్యవసరంగా రక్తం అవసరం ఉండగా, జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గోవిందుల జీవన్ రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నాడు. కానిస్టేబుల్ జీవన్ ఇప్పటి వరకు 16 సార్లు రక్తదానం చేసి పలువురి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా కానిస్టేబల్ జీవన్‌ను పలువురు అభినందించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కథలాపూర్: మండలంలోని కలిగోట శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం పట్టుకుని వారి నుంచి రూ.10,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయ నృత్యప్రదర్శనలో ధర్మపురి కళాబృందం



నంది అవార్డు అందుకున్న నాట్య బృందం

ధర్మపురి: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ నృత్య ప్రదర్శనలో ధర్మపురికి చెందిన నాట్య కళాబృందం వారు ఆదివారం నంది అవార్డును అందుకున్నారు. పోటీల్లో ధర్మపుకి చెందిన సామ శివానీ నాట్య బృందం వారు హరిప్రియ, మనుశ్రీ, అవంతిక, మేఘన తదితరులు ప్రదర్శించిన నాట్యానికి మహా శివ నంది అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నాట్య గురువు శివానిని నాట్య పరబ్రహ్మ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ పటేల్ తదితరులు హాజరయ్యారు.

ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్: ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ట్రస్మా మండల అధ్యక్షుడు అల్వాల ఆత్మారాం అన్నారు. మండలంలోని రాఘవపేటలో ఆదివారం ఇటీవల ఎన్నికైన ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీధర్, జిల్లా జాయింట్ సెక్రటరీ పోతు గోపి, రాష్ట్ర ఈసీ మెంబర్ సీబీ.అనిల్‌సింగ్‌లను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఉపాధ్యాయులకు, సిబ్బందికి వేతనాలను సైతం ఇవ్వలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్ స్కూళ్లను మినహాయించి మిగిలిన ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రస్మా మండల ప్రధాన కార్యదర్శి తోట రవీందర్, కోశాధికారి మిట్టపెల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సభ్యులను సన్మానిస్తున్న ట్రస్మా అధ్యక్షుడు

కాంట్రాక్టు లెక్చరర్‌కు జేఎల్ ఉద్యోగం



ఇందిర స్వరాజ్యం

జగిత్యాలటౌన్: మైనార్టీ గురుకుల కళాశాలలో కాంట్రాక్టు జేఎల్‌గా పనిచేస్తున్న జగిత్యాలకు చెందిన వి ఇందిరస్వరాజ్యం ఇటీవల వెలువడిన గురుకుల అధ్యాపక ఫలితాల్లో బాటనీ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న తాను రెగ్యులర్ లెక్చరర్ ఉద్యోగం సాదించడంలో అత్త,మామ,భర్త సంతోష్ ప్రోత్సాహం ఉందన్నారు.

ప్రభుత్వ విద్యను గాడిలో పెట్టండి

జగిత్యాలటౌన్: గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యను గాడిలో పెట్టాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తపస్ నాయకులు కోరారు. ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తపస్ నాయకులు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమలుతో పాటు సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు, బకాయి ఉన్న డీఏల మంజూరు, 317 జీవో తదితర సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో తపస్ జిల్లా నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మచ్చ శేఖర్



శేఖర్



నరేశ్

రాయికల్: రాయికల్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేశ్, కోశాధికారిగా కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా కుర్మ సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జెడ్సీ కాటిపెల్లి రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, లయన్స్‌క్లబ్ డీసీ మ్యాకల రమేశ్, బత్తిని భూమయ్య, అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో గురువులు

సారంగాపూర్: బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 లో పదో తరగతి చదివిన అప్పటి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడు తమకు బోధించిన ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం పెద్ది ఆనందం,ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటా, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వెంకటనారాయణ, డైరెక్టర్ శ్రీకాంత్, డీన్ నరసింహారాజు, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృథాగా భగీరథ నీళ్లు



గేట్‌వాల్ నుంచి పోతున్న భగీరథ నీళ్లు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం నుంచి గోధూర్ వెళ్లే దారిలో మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ గేట్‌వాల్ నుంచి ఆదివారం భగీరథ నీళ్లు వృథాగా పోతున్నాయి. స్వచ్ఛమైన తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.